క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు



పాత గుంతలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

సైదాపురం: మండలంలో అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, ఈ క్రమంలో సైదాపురంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నట్లు జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాస కుమార్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఏఏ ప్రాంతాల్లో అక్రమంగా తవ్వకాలు సాగించారనే విషయంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

సైదాపురం: ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డులు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి హైమావతి తెలిపారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం సీసీఆర్‌సీ కార్డుల పై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కౌలు రైతు గుర్తింపు ఉన్న రైతులకు పంటల బీమా, అన్నదాత సుఖీభవ పథకాలు వర్తిస్తాయని పేర్కొన్నారు. బ్యాంకు రుణాలు కూడా మంజూరు చేయిస్తామన్నారు.

జీవన ఎరువులు, జీవ నియంత్రణపై శిక్షణ



జీవ ఎరువులను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు ఆధ్వర్యంలో రైతులకు జీవన ఎరువులు, జీవన నియంత్రణపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల ద్వారా నేల సారం పెరుగుతుందన్నారు. అనంతరం రైతులకు జీవన ఎరువులు పంపిణీ చేశారు. ఏడీఏ నాగార్జునసాగర్, శాస్త్రవేత్త రాజీవన, పి.నాగార్జునరెడ్డి, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

వాకాడు : ఐకమత్యంతోనే హక్కుల సాధన సాధ్యమని స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపోకు చెందిన నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. వారు శుక్రవారం స్థానిక ఇరిగేషన్ అతిథి గృహంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీలో నూతన విధివిధానాలపై చర్చించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెంచులయ్య, జోనల్ అధ్యక్షుడు డీవీఆర్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్, బీఎస్ బాబు, గుణశేఖర్, సుధాకర్ రావు, ఆర్ముగం, సురేష్, భాస్కరయ్య, రఘురామయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తల్లంపాడులో డ్రైడే

దొరవారిసత్రం : తొగరాముడి హీహెచ్‌సీ పరిధిలోని తల్లంపాడు గ్రామంలో శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడడంతో పాటు ఇళ్ల మధ్యలో ఉన్న పేడ దిబ్బలు తొలిగించేలా చర్యలు చేపట్టారు. అదే విధంగా గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జనార్ధనయ్య, రనూషా, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు

రాపూరు: రాపూరులోని అతిపురాతన రామనాథేశ్వరస్వామి ఆలయంలో కొలువైన సుబ్రమణ్య స్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ప్రధానార్చకులు రామనాథేశ్వర శర్మ తెలిపారు. ఆషాడ మాసం శుద్ధ షష్టి (కుమార షష్టి) పర్వదినం సందర్భంగా స్వామి వారికి పాలు, చందనం, కొబ్బరి నీరు, విభూదితో అభిషేకం చేసినట్లు తెలిపారు.

15న లక్ష్మీ నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: మండలంలోని పెంచలకోనల పెనుశిల లక్ష్మీ నరసింహస్వామికి 15వ తేదీన చందనాలంకరణ చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఉదయం 4 గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతి హోమం, 10 గంటలకు కల్యాణం, రాత్రి 7 గంటలకు గరుడ సేవ నిర్వహిస్తామన్నారు.

సమస్యలు పరిష్కారానికి కృషి

తడ: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని కాదలూరు వద్ద రిజర్వాయర్ పనులు పూర్తి చేసి తెలుగు గంగ నీరు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. చేనిగుంట గ్రామం వద్ద కరిపేటి కాలువ పనులు పూర్తి చేస్తామన్నారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, ఎంపీపీ రఘురెడ్డి, డీఎల్‌పీవో రవీంద్రబాబు, తహసీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్‌కుమార్, డీఎల్‌డీవో వెంకటశేషయ్య పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- కోతకు గురైన రోడ్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికారులు





తీర గ్రామమైన మీజూరు గ్రామ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు, మావిళ్లపాడు గ్రామ సమీపంలో వర్షానికి భారీగా కోతకు గురైన తారు రోడ్డు

దొరవారిసత్రం : భారీ వర్షాలకు మండలంలో పలు రోడ్లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదాల బారిన పడాల్సిందే. ఈ విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల పరిధిలో 108 రోడ్లు ఉన్నాయి. అవి సుమారు 180 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పలు రోడ్లు దెబ్బతిన్నాయి. వాటికి ఇప్పటి వరకు మరమ్మతులు చేయలేదు. ఈ రోడ్లపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని పలువురు ప్రయాణికులు, ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్లు ఇంకా దెబ్బతిన్నాయి. రాత్రుల్లో ప్రయాణం అంటేనే ప్రాణాలతో చలగాటంలా మారిందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా మావిళ్లపాడు నుంచి మంగానెల్లూరు వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డు బాగా దెబ్బతింది. మావిళ్లపాడు, తనియాలి, వీఎంఆర్ నగర్ గ్రామాల సమీపంలో కురిసిన వర్షాలు రోడ్డు కోతకు గురై పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ ప్రాంతాల్లో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం తప్పదు. అదే విధంగా పోలిరెడ్డిపాళెం నుంచి కల్లూకుకంద్రిగ వరకు నాలుగు కిలోమీటర్లు, ఆబాకు నుంచి కారికాడు వరకు ఉన్న 18 కిలోమీటర్ల రోడ్డు, పూలతోట నుంచి సింగనాలత్తూరు వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు, పిండిపాళెం నుంచి శ్రీధనమల్లి గ్రామం వరకు నాలుగు కిలోమీటర్లు రోడ్డు దెబ్బతిన్నాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న సైడ్ బరమ్స్ వర్షానికి కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. అలాగే పీఆర్ పరిధిలోని చవటకంద్రిగ, కరటాముడి, వేణుంబాకం, కారికాడు గ్రామాల్లో సుమారు 20 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు, ఆటోల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తెలుగురాయపురంలో 'నేను బడికి పోతా' ర్యాలీ



'నేను బడికి పోతా' ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కలువాయి: మండలంలోని తెలుగురాయపురంలో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా కలువాయి ఎంఈవో-2 జి.శేషగిరిరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలు అందరూ పాఠశాలల్లో ఉండాలన్నారు. వంద శాతం ఎన్‌రోల్‌మెంట్ సాధించాలని, ఆ దిశగా పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, బ్యాగులు అందజేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం నాణ్యమైన భోజనం పెడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జీవీ మురళీకృష్ణ, బి.మస్తాన్‌బాబు, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వినోద్, వీరేంద్ర, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేటలోని గరిడీవీధి ఉన్న హజరత్ మౌలాలి తాలీంఖానాలో శుక్రవారం రాత్రి పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలాలి తాలీంఖానా యువజన కమిటీ సభ్యులు, పెద్దలు గరిడీలో పీర్లు ప్రతిష్ఠించి పాతేహాలు చేశారు. అనేక మంది భక్తులు ఇళ్ల నుంచి జెండాలను ఊరేగింపుగా తీసుకువచ్చి పీర్ల వద్ద ఉంచారు. అనంతరం మౌలాలి పంజా (పీర్లు)ను గుర్రంపై ప్రతిష్ఠించి పట్టణంలో ఊరేగించారు. రాత్రి కుండపోత వర్షం కురిసినా ఊరేగింపును ఆపలేదు. ఊరేగింపులో పిల్లల పులివేషాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

చిట్టమూరు (చిల్లకూరు) : చిట్టమూరు మండలం ఆరూరులో శుక్రవారం పీర్ల పండుగను ఘనంగా ప్రారంభించారు. 16 వరకు నిర్వహించే పండుగలో భాగంగా తొలి రోజు చావిడిలో పీర్లను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు హిందూ, ముస్లింలు అటుకులు, బొరుగులు, బెల్లం బూందిని చదివించారు. శనివారం పీర్ల ఊరేగింపు, 14న రెండో అగ్నిగుండ ప్రవేశం, 15న గ్రామోత్సవం, 16న పీర్ల నిమజ్జనం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య పనులతో దోమల నియంత్రణ



పెళ్లకూరుమిట్ట ప్రాంతంలో నిల్వ ఉన్న నీటిని తొలగిస్తున్న అధికారులు



పారిశుద్ధ్య పనులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పెళ్లకూరు: గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టడం ద్వారా దోమల వృద్ధిని నియంత్రించవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణారావు తెలిపారు. పెళ్లకూరుమిట్టలో శుక్రవారం తాగునీటి కొళాయిలు, బోర్ల వద్ద చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి బావులు, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, ఏఎన్‌ఎం నాగూరమ్మ, రమ్య, సుష్మ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని 14వ వార్డు ధర్మాపురం, నరసింహారావు వీధుల్లో శుక్రవారం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదన్నారు. దీంతో దోమలు వృద్ధిచెంది జ్వరాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పారిశుద్ధ్య పనులు చేపట్టారని వివరించారు.

పరిసరాల శుభ్రతతో రోగాలకు చెక్

ఓజిలి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటు వ్యాధులను నియంత్రించవచ్చని భువనగిరిపాళెం పంచాయతీ కార్యదర్శి భూదేవి తెలిపారు. ఆమె శుక్రవారం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలో డ్రైడే నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు చేయించారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. మురుగు కాలువలను శుభ్రం చేయించారు. కాలువల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులు చల్లించారు. గ్రామస్తులకు డ్రైడేపై అవగాహన కల్పించారు.

పిల్లలను బడిలో చేర్పించిన ఉపాధ్యాయుడు



విద్యార్థినికి పుస్తకాలు ఇస్తున్న టీచర్ శ్రీనివాసులు

వాకాడు : మండలంలోని ముట్టెంబాక ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాసులు శుక్రవారం నలుగురు పిల్లలను బడిలో చేర్పించారు. ఆయన పిల్లలకు అర్థమయ్యేలా విద్యా బోధనలు చేయడంతోపాటు తన సొంత నిధులతో విద్యా సామ గ్రి అందజేస్తుంటారు. గ్రామాల్లో బడి బయట పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి బడిలో చేర్పిస్తుంటారు. ఈ క్రమంలో శుక్రవారం ముట్టెంబాక ఊరి బయట రొయ్యల గుంతల వద్ద ఉన్న నలుగురు గిరిజన విద్యార్థులను బడిలో చేర్పించారు. ఆయనను పలువురు అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న హెచ్‌ఎం స్వతంత్రకుమారి

చిల్లకూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని పున్నపువారిపాళెం పాఠశాల హెచ్‌ఎం స్వతంత్రకుమారి తెలిపా రు. ఆమె శుక్రవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. దీన్ని నివారించేందుకు చెట్లను నరికి వేయకుండా ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

నిమ్మ పరిశోధన కేంద్రంలో మౌలిక వసతుల కల్పన

వెంకటగిరి(సైదాపురం): నిమ్మ పరిశోధన కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరి సమీపంలోని పెట్లూరు వద్ద ఉన్న నిమ్మ పరిశోధన కేంద్రాన్ని తనిఖీ చేశారు. శాస్త్రవేత్త మధుమతి మాట్లాడుతూ నిమ్మ పరిశోధన కేంద్రంలో కల్పించాల్సిన వసతుల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ సీసీనాయుడు ఉన్నారు.

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

సైదాపురం: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డీఎస్ విజయ్‌కుమార్ గురువారం రాత్రి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సైదాపురం సమీపంలోని కైవల్యానదీ పరివాహక ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందిందని తెలిపారు. దాడి చేసి ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

కల్లూరులో పూరిల్లు దగ్ధం

దొరవారిసత్రం : మండలంలోని కల్లూరులో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి షేక్ నబీరసూల్‌కు చెందిన పూరిల్లు కాలిపోయింది. లక్షన్నరకు పైగా ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. గాలులు వీయడంతో విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకుని నిప్పు రవ్వలు పడడంతో పూరింటికి నిప్పు అంటుకుందని స్థానికులు తెలిపారు. దీంతో ఇంటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు, పలు వస్తువులు కాలిపోయినట్లు పేర్కొన్నారు. ప్రమాదంపై స్థానిక వీఆర్వో మధు విచారణ జరిపారు. నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు.

10 ఏళ్లు అటానమస్ హోదా

గూడూరు రూరల్ : గూడూరు సమీపంలో ఉన్న ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలకు ప్రభుత్వం మరో పదేళ్లు అటానమస్ హోదాను ఇచ్చిందని ప్రిన్సిపాల్ వంకి పెంచలయ్య తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల క్రితం కళాశాలకు ప్రభుత్వం అటానమస్ హోదా ఇచ్చిందని, నాటి నుంచి కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఈ క్రమంలో ఉన్నత విద్యా మండలి మరో పదేళ్లు అటానమస్ ఇచ్చిందని వివరించారు. అలాగే ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను డీమ్డ్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ఏవో రామయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి రూరల్/రాపూరు/నాయుడుపేట టౌన్: వెంకటగిరి పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున వెంకటగిరి టౌన్, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. రాపూరులో విద్యుత్ లైన్ల మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కార్తీక్ తెలిపారు. నాయుడుపేట పట్టణంలో 11 కేవీ, 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల వల్ల శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు ఏఈ పి.వెంకటస్వామి తెలిపారు.

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

గూడూరు రూరల్ : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తెలిపారు. పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఎంవీఐ ప్రభాకర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం తప్పుతుందన్నారు. లీగల్ అడ్వైజర్ కోటేశ్వరరావు, పట్టణ సీఐ పాపారావు, ఎస్ఐ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

వెంకటగిరి రూరల్ : ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని సీఐ సంగమేశ్వరరావు, ప్యానల్ న్యాయవాది గాంధీ తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ, పోలీసులు సంయుక్తంగా శుక్రవారం వెంకటగిరిలోని క్రాస్ రోడ్డులో వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల్లో ప్రాణాపాయం తప్పుతుందన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



బినితశ్రీ



ప్రణతి

కోట/చిల్లకూరు: కోట బీసీ గురుకుల పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నారాయణరావు తెలిపారు. అదేవిధంగా మండలంలోని కొత్తపాళెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు, చిట్టేడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇద్దరు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఎంఈవో మస్తానయ్య తెలిపారు. అలాగే చిల్లకూరు మండలంలోని చింతవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని దట్టం బినితశ్రీ (568), పుదూరు గురుకుల బాలికల పాఠశాల విద్యార్థిని ప్రణతి (567) ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని ఈదలపల్లి గ్రామం నుంచి గూడూరు వైపు అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం.. గూడూరు మండలంలోని రేషన్ డీలర్ షాప్ నుంచి 400 కిలోల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండడంతో వేములపాళెం వద్ద రెవెన్యూ అధికారులతో కలసి దాడులు చేసి ఆటోతో పాటుగా బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

గూడూరు రూరల్ : గంజాయిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం గూడూరు రైల్వే స్టేషన్‌లో ఆకతాయిలు, పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అవసరమైతే వారిని కౌన్సెలింగ్ కేంద్రాలకు పంపుతామన్నారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్టు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

చెన్నూరులో వసతులు కల్పించాలని వినతి

గూడూరు రూరల్ : గూడూరు మున్సిపాలిటీలో విలీనమైన చెన్నూరులో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నాయకులు కోరారు. వారు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో పలువురు అతిసారం బారిన పడ్డారని తెలిపారు. రాత్రిళ్లు వీధి దీపాలు వెలగడం లేదన్నారు. నాయకులు గుర్రం రమణయ్య, ఆర్ శ్రీనివాసులు, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

చిల్లకూరు : ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని ఈవోపీఆర్‌డీ మాణిక్యం ఆదేశించారు. ఆయన శుక్రవారం చింతవరం అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి నాగూరయ్య, సచివాలయ, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఉడతావారిపాళెంలో పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఏఎన్‌ఎం వరలక్ష్మి పర్యవేక్షించారు.

కండలేరులో 6.303 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏపీ స్టూడెంట్స్ జేఏసీ నూతన కమిటీ ఎంపిక

సూళ్లూరుపేట : ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గ నూతన కమిటీని ఎంపిక చేసినట్టు తిరుపతి జిల్లా అధ్యక్షుడు గార్లపాటి శ్రీధర్ తెలిపారు. అధ్యక్షుడిగా కన్నంబాకం రాజేష్, ఉపాధ్యక్షుడిగా అంబూరు నవీన్‌ను నియమించినట్టు పేర్కొన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఏపీ స్టూడెంట్స్ జేఏసీని బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు.

సైదాపురంలో రక్తదాన శిబిరం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో శుక్రవారం సన్‌రైజ్ ట్రస్ట్ ఏఐఎస్ఎఫ్ నాయకుడు షఫీ హరన్ ఆధ్వర్యంలో మొబైల్ రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది యువకులు రక్తం దానం చేశారు. వారిని ఏరియా ఆస్పత్రి వైద్యులు అభినందించారు. వారు మాట్లాడుతూ రక్తం దానం చేయడం వల్ల మరొకరికి ప్రాణ దానం చేయవచ్చన్నారు.